క్లుప్తంగా

చవితి వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి

గోకవరం: వినాయక చవితి వేడుకల్లో ఉత్సవ కమిటీ సభ్యులు విధిగా నిబంధనలు పాటించాలని కోరుకొండ సీఐ వై.ఉమామహేశ్వరరావు, గోకవరం ఎస్సై యువి శివనాగబాబు సూచించారు. గోకవరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేయడానికి పోలీసు, విద్యుత్‌శాఖ, ఫైర్ శాఖల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రాత్రి సమయంలో విగ్రహాల వద్ద విధిగా కాపలా ఉండాలన్నారు. నిమజ్జనం సమయంలో వినియోగించే వాహనాల వివరాలను ముందుగా తమకు తెలియజేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వరసాల ప్రసాద్, పాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



అన్నవరంలో వ్యాసరచన పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

అన్నవరం: స్థానిక సంకల్పం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సత్యదేవ సంస్కృతోన్నత పాఠశాలలో గురువారం హిందీ దివస్ నిర్వహించారు. సంకల్పం సంస్థ గౌరవ సభ్యుడు కోట నాగేంద్ర కుమార్‌రాజా ఆధ్వర్యంలో అన్నవరం, పరిసర గ్రామాల విద్యార్థులకు హిందీ భాషపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అన్నవరం హైస్కూల్ హెచ్‌ఎం అల్లాడ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ డీఈఓ వేంకట రమణ, దేవస్థానం హైస్కూల్ ఉపాధ్యాయులు, సంకల్పం సభ్యుడు మహేంద్రవాడ జగదీష్ తదతరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

జగ్గంపేట: జాతీయ హిందీ భాషా దినోత్సవం సందర్భంగా జగ్గంపేటలోని విద్యార్థులకు కడియం గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యనారాయణ 200 మొక్కలు పంపిణీ చేశారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

రౌతులపూడి: ఈ ఏడాది రైతు భరోసా పథకం లబ్ధి పొందేందుకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు సూచించారు. గతంలో లబ్ధిపొందిన రైతులు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా ఈ పథకంలో లబ్ధిపొందాలనే రైతులు తప్పనిసరిగా స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, నమూనా ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లను దరఖాస్తులో జత చేసి వ్యవసాయ సిబ్బందికి అందించాలని సూచించారు

టీడీపీకి జనసేన దాసోహం



ఒమ్మి రఘురాం

జగ్గంపేట: రాజకీయాల్లో పొత్తులు సహజమని, కాని సొంత పార్టీ భవిష్యత్‌ను పట్టించుకోకుండా వేరే పార్టీకి దాసోహమైన సందర్భాలు అరుదని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసే పోటీ చేస్తాయన్న ప్రకటనపై స్పందించారు. పవన్‌కల్యాణ్ నిర్ణయంతో జనసేన క్యాడర్ అయోమయంలో పడిందన్నారు. ప్యాకేజీ కోసం టీడీపీ పార్టీకి జనసేనను దాసోహం చేయ్యడం విడ్డూరంగా ఉందన్నారు. పైగా రాష్ట్ర భవిష్యత్ కోసం తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు పవన్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలుగుదేశం భవిష్యత్ కోసమే తాను పొత్తు పెట్టుకున్నట్లు ప్రకటిస్తే బాగుండేదని ఎద్దేవా చేసారు. రాజకీయాల్లో హత్యలు ఉండవని, ఆత్మహత్యలే ఉంటాయని జనసేనాని నిరూపించారని విమర్శించారు.

భవన నిర్మాణ కార్మికుల అరెస్టు

తుని: హక్కుల సాధన పేరుతో తుని మండలం ఎస్ అన్నవరంలో మంత్రి దాడిశెట్టి రాజా ఇంటిని ముట్టడించేందుకు వెళుతున్న భవన, ఇతర నిర్మాణ కార్మికులను గురువారం పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన చేస్తున్న సీఐటియూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీతో పాటు పలువురు సీఐటీయూ, కార్మిక నేతలను తుని రూరల్ సీఐ సన్యాసిరావు అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా పలువురు నేతలను గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు మాట్లాడుతూ న్యాయబద్ధంగా పోరాటం చేస్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. దివంగత నేత వైఎస్సార్ హయాం నుంచి అమలవుతున్న అనేక పథకాలను ఈ ప్రభుత్వం నిలిపివేసి కార్మికులకు వెన్నుపోటు పొడిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన నాయకులను సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తులపై పోలీసులు విడుదల చేశారు.

మురిపించ్ఛన్

- గ్రామాల్లో జోరుగా కొత్త పెన్షన్ల పంపిణీ
- కిర్లంపూడిలో 419 మందికి అందజేసిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



జగ్గంపేటలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం ఎంపీపీ తోట రవి అధ్యక్షతన లబ్ధిదారులకు కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని 419 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పింఛన్లు రావాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ నెల 30 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తోట గాంధీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్, తోట విష్ణు, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, జనపరెడ్డి బాబు, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు గురువారం కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. తేటగుంటలో సర్పంచ్ అత్తి నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు 85 మందికి నూతన పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 721 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. దొండవాక, చేపూరు గ్రామాల్లో లబ్ధిదారులకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పింఛన్లు అందజేశారు. పార్టీ నాయకులు గణేసుల వీరబాబు, లంక సత్యనారాయణ, మామిడి శ్రీనివాసరావు, దాడిశెట్టి దేవుడు, గొర్లి విష్ణు, మొల్లు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

జగ్గంపేట: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలో కొత్తగా మంజూరైన 343 మందికి ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు ,తెలికుల కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరి నాని, ఎంపీడీఓ వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తేటగుంటలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రాచపల్లిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను అన్నారు. మండలంలోని రాచపల్లిలో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లను గురువారం ఆయన పంపిణీ చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందని, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమలో గ్రామ సచివాలయ కన్వీనర్లు ఒమ్మి వెంకటరమణ, మర్రి చంద్రరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

19 నుంచి సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేస్తున్న ఉపాధి సిబ్బంది

తుని రూరల్: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి ఈ నెల 19 నుంచి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్టు ఉపాధి ఏపీఓ పసుపులేటి నారాయణరావు గురువారం తెలిపారు. సోషల్ ఆడిట్‌కు అవసరమైన రికార్డులను ఏపీఓ పర్యవేక్షణలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సిద్ధం చేస్తున్నారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకూ వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ పనులకు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.18.50 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ మొత్తం పనులకు సోషల్ ఆడిట్ జరగనుందన్నారు. సోషల్ ఆడిట్ అనంతరం గ్రామ, మండల స్థాయిలో ప్రజా వేదికలు నిర్వహించి నివేదికలను వెల్లడిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో సోషల్ ఆడిట్‌కు రైతులు, లబ్ధిదారులు సహకరించాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



తుని సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ రాము

తుని రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ తీసుకువెళదామని, ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను సమష్టిగా అందిద్దామని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం తేటగుంట, ఎన్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఏఎన్ఎంలు, సచివాలయ హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాము మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టిందన్నారు. గ్రామాల్లో నెల 30 నుంచి నవంబర్ ఒకటి వరకు వైద్య శిబిరాలు నిర్వహించేందుకు రెండు ప్రత్యేక బృందాలు నియమించినట్టు తెలిపారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, ఎంఈఓ-2 రామకృష్ణ, డాక్టర్ కె.అన్వేషి, డాక్టర్ ఎస్ఎస్ఎల్ రాజశేఖర్, డాక్టర్ ఆర్.సౌమ్య పాల్గొన్నారు.

విస్తృతంగా ఎస్‌ఈబీ దాడులు

- 3,500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం
- సారాతో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..మంగళగిరి, రాష్ట్ర స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు అందిన సమాచారం మేరకు స్థానిక ఎస్ఈబీ సిబ్బంది గ్రామాల్లో దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, పరారీలో ఉన్న మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. 3,500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి, 45 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఏలేశ్వరం ఏలేరు ప్రాజెక్టు రిజర్వాయర్ సమీపంలో సూరంపూడి కృష్ణను అరెస్టు చేసి, అతని నుంచి యాక్టివా వాహనంతో పాటు 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కృష్ణ నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 1,900 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఇతనికి నల్లబెల్లం సరఫరా చేస్తున్న సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన గోపాలకృష్ణపై పరారీ కేసు నమోదు చేశారు. అదే గ్రామంలోని మరో సారా బట్టీపై దాడి చేసి 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కోట లోవరాజు అనే వ్యక్తిపై పరారీ కేసు నమోదు చేశారు. శంఖవరంలో ఐదు లీటర్ల సారాతో గవరసాని శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఏపీ మంగళగిరి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఎస్ఎస్ఎస్‌డీవీ ప్రసాదరావు, స్థానిక ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సారా, బైక్, నిందితుడితో ప్రత్తిపాడు ఎస్ఈబీ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి గురువారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, అర్చకులు దత్తాత్రేయ శర్మ, వనదుర్గ ఆలయ అర్చకులు యడవిల్లి ప్రసాద్, వ్రతపురోహితులు కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



తునిలో స్కూల్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి, తదితరులు



కోటనందూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ లగుడు శ్రీనివాసు గురువారం ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే స్కూల్ గేమ్స్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎంపీపీ శ్రీనివాసు అన్నారు. అండర్-14, 17 విభాగాల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, టెన్నిస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పీడీ జాన్‌విక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఏబీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, దార్ల సూర్యచంద్ర, పీఏసీ చైర్మన్ ఉల్లూరి కనకదుర్గా శ్రీను, సర్పంచ్ పసగడుగుల వరహాలు, ఎంపీడీఓ శర్మ, ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

తుని: గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడాపోటీలు నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక రాజా గ్రౌండ్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలను గురువారం ఎంపీపీ బొప్పన రాము, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణతో కలిసి ఆమె ప్రారంభించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు స్కూల్ గేమ్స్‌ను చక్కగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంఈఓ గీతాదేవి పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

తొండంగి: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని రావికంపాడు అరిగెల లచ్చన్న దొర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మూడు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాట్మింటన్, త్రోబాల్, టెన్నీకాయిట్, యోగా, అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామని ఎంఈవో షేక్‌బాబ్జి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గాబు రాజు, పార్టీ నాయకులు దడాల విజయబాబు, సిద్దా శ్రీనివాసరావు, కోడూరి దివానం, వెల్నాటి గంగాధర్(గెడ్డం బుజ్జి), ఎంపీటీసీ వెల్నాటి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రావికంపాడు జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నాగం గంగబాబు

పొలంబడితో అధిక దిగుబడులు



నెల్లిపూడిలో వైఎస్సార్ పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు



కిర్లంపూడిలో రైతులకు కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కిర్లంపూడి: పంటలు సాగు చేసిన రైతులు అధిక దిగుబడులు సాధించేందుకే గ్రామాల్లో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎఫ్‌టీసీ డీడీఏ హరి తెలిపారు. కిర్లంపూడిలో ఏఓ జోకా అమృత ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. రైతులకు ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడరాదన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. వరిలో పసరపురుగు, దోమ నివారణకు వేపాకు కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

పొలం గట్లపై కంది సాగుతో అధిక దిగుబడులు

శంఖవరం: ఖరీఫ్‌లో వరిసాగు చేసిన రైతులు పొలం గట్లపై కంది సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. మండలంలోని నెల్లిపూడిలో గురువారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా వరి పంటను దోమ, పచ్చ పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. దోమల నివారణకు జిగురు అట్టలను పొలాల్లో అమర్చాలన్నారు. కంది సాగు అవశ్యకతను రైతులకు వివరించారు. వీఏఏ శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు గుర్తింపుపై హర్షం

గోకవరం: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని ఆర్టీసీ గోకవరం డిపో యూనియన్ చైర్మన్ పైడిమళ్ల లక్ష్మణ్ రావు, అధ్యక్షుడు ప్రగడ ప్రసాద్, కార్యదర్శి అక్కిరెడ్డి కృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన తరువాత అధికంగా ఉద్యోగులు ఉన్న ఎంప్లాయిస్ యూనియన్‌కు గుర్తింపు ఇచ్చి ఉద్యోగుల సమస్యలపై అధికారికంగా మాట్లాడే అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమెషీన్లు, ధ్రువపత్రాలు అందజేస్తున్న స్వర్ణలత, నాగబాబు తదితరులు

కిర్లంపూడి: మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఏపీ ఎన్‌జీవో సంస్థ కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు పెంటకోట నాగబాబు అన్నారు. స్థానిక కుమ్మరి వీధిలో స్వర్ణ సోషల్ సర్వీస్, సీఆర్‌పీఎఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 55 మంది మహిళలకు కుట్టు మెషీన్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు పెంటకోట నాగబాబు, సీఆర్‌పీఎఫ్ ఫౌండర్ గుడివాడ పాల్ ప్రసాద్ కుట్టు మెషీన్లు, ధృవపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనేజేషన్ ఫౌండర్ పి.స్వర్ణలత మాట్లాడుతూ పేద, మధ్యతరగతి మహిళలకు 40 రోజుల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 55 మందికి రూ.7500 విలువ చేసే కుట్టు మెషీన్లను రూ.3000లకే అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో శరకణం సంతోష్, రాపేటి ప్రసాద్, నక్కా వీరబాబు, మరిసే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ విలువలు నేర్పాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు



ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

గోకవరం: ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిత్వ విలువలు నేర్పాలని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాలులో గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సుంకర వెంకటరమణ, సావిత్రి ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు రాజ్యాంగ విలువలు నేర్పాలన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు ఎస్.ఉమామహేశ్వరరావు, మండల ఉత్తమ ఉపాధ్యాయులు బీబీటీ దొర, ఎ.జోగిరాజు, జి.స్వర్ణలత, పీపీ లచ్చిరెడ్డి, బి.మహేశ్వరరావులను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ తదితరులతో కలిసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావును ఉపాధ్యాయులు, ఎంపీపీ, ఇతర వైఎస్సార్ సీపీ నాయకులు సన్మానించి జ్ఞాపకను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి తమ్మన్నదొర, సుంకర వెంకటరమణ, సుంకర వీరబాబు, దాసరి చిన్నబాబు, కర్రి సూరారెడ్డి, గుల్లా ఏడుకొండలు, వరసాల ప్రసాద్, ప్రముఖ వైద్యుడు బద్దిరెడ్డి రామారావు, బి.గౌరమ్మ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో చోరీ

పిఠాపురం: గొల్లప్రోలులోని తాళాలు వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్టు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... గొల్లప్రోలుకు చెందిన బెజవాడ శివ తన భార్య, కుమారుడితో కలిసి గొల్లప్రోలు గంటావారి గొయ్యి ప్రాంతంలోని తన ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 9న కుటుంబ సభ్యులతో కలిసి తుని మండలం వల్లూరులో ఒక వివాహ వేడుకకు వెళ్లారు. 11వ తేదీన తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అనుమానం వచ్చి వెళ్లి చూడగా బీరువాలోని ఉన్న మూడు కాసుల బంగారు హారం, రూ 18000 చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.